- జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

# విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 20 : విద్యార్థులు చిన్నతనం నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంచుకొని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో బుధవారం జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా వింటూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీ, మంచి నడవడికను అలవర్చుకోవాలని, అప్పుడు అనుకున్న లక్ష్యానికి చేరుకుంటారన్నారు. జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి ఆయన బహుమతులు ప్రదానం చేశారు. తౌలుత భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో కలెక్టర్ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ శ్రీనివాసరావు, డీఈవో వెంకటేశ్వరాచారి, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు

# పనులెప్పుడయ్యేనో..! నీళ్లెప్పుడొచ్చేనో..!!

- పాలేరు లింకు కెనాల్ తవ్వకాల్లో జాప్యం
- పలు ప్రాంతాల్లో పూర్తికాని భూసేకరణ
- కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఆలస్యం
- బీఆర్ఎస్ పాలనలో పరుగులు పెట్టిన పనులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నదాతల అసంతృప్తి
- సాగునీటి కోసం ఎదురుచూస్తున్న జిల్లా రైతాంగం

**ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన 'సీతారామ' ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు అప్పట్లో పరుగులు పెట్టినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పనులు ముందుకు కదలడం లేదు. పూర్తయిన పనులకు కాంట్రాక్టు ఏజెన్సీలకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించకపోవడం, కాల్వల కోసం ఇప్పటికీ కొన్నిచోట్ల భూములను కొనుగోలు చేయకపోవడంతో ఆ ప్రాంతాల్లో పనులే ప్రారంభంకాలేదు. కొద్దోగొప్పో జరుగుతున్న పనులు సైతం వేగంగా సాగడం లేదు. దీంతో సీతారామ ప్రాజెక్టు పనులు ఎప్పటికీ పూర్తయ్యు.. ఎప్పుడు సాగునీళ్లు వస్తాయో అర్థంకాక అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.**

*- తిరుమలాయపాలెం, నవంబర్ 20*



### పనులు త్వరితగతిన పూర్తి చేయాలి..

సీతారామ ప్రాజెక్టు పనులను కాంగ్రెస్ ప్రభుత్వం త్వరితగతిన పూర్తిచేయాలి. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులే తప్ప ప్రస్తుతం పనులేమీ జరగడం లేదు. పాలేరు లింక్ కెనాల్ తవ్వకంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తరలించి కృష్ణా, గోదావరి జలాలను అనుసంధానం చేసే లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టును చేపట్టింది. **– తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ**

## నత్తనడకన 'సీతారామ' కాల్వల నిర్మాణం

ఉమ్మడి ఖమ్మంజిల్లాను సస్యశ్యామలం చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గోదావరి నదిపై బీజీ కొత్తూరు వద్ద సీతారామ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం దుమ్ముగూడెం, అశ్వాపురం, మొండికుంట ప్రాంతాల్లో సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తికావొచ్చాయి. కానీ.. ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం పాలేరు లింక్ కెనాల్ పనులు ముందుకు సాగడం లేదు. బీఆర్ఎస్ హయాంలోనే పాలేరు లింక్ కెనాల్‌ను రూ.1,600 కోట్ల వ్యయంతో ఏన్కూరు 104.4 కిలోమీటరు వద్ద నుంచి పనులు ప్రారంభించారు. ఏన్కూరు నుంచి పాలేరు వరకు 76.92 కిలోమీటర్ల మేర కాల్వ తవ్వకం పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకుగాను 2,606 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉండగా.. గత కేసీఆర్ ప్రభుత్వం 758 ఎకరాల భూమి కొనుగోలును పూర్తి చేసింది. సీతారామ ప్రాజెక్టు పాలేరు లింక్ కెనాల్ 13, 14, 15, 16 ప్యాకేజీ పనులు గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే తవ్వకాలు జరిగినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం ఆధ్వర్యంలో పనులు జరగడం లేదు. పాలేరు లింక్ కెనాల్‌లో భాగంగా 13 ప్యాకేజీలో జూలూరుపాడు, డోర్నకల్ మండలాల్లో 10 కిలోమీటర్లు కాల్వ తవ్వకాలు చేయాల్సి ఉండగా.. ఇంకా టెండర్ల ప్రక్రియ చేపట్టలేదు. పనులు ప్రారంభమే కాలేదు. 14 ప్యాకేజీలో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలోని మండలాల్లో 29 కిలోమీటర్లు కాల్వ తవ్వాల్సి ఉండగా.. గార్ల మండలం బుద్దారం వద్ద అర కిలోమీటరు కాల్వ మాత్రమే పూర్తి అయింది. 15 ప్యాకేజీలో 27 కిలోమీటర్లు కాల్వ తవ్వాల్సి ఉండగా.. 17 కిలోమీటర్లు మాత్రమే కాల్వ తవ్వకం జరిగింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో 17 ప్యాకేజీలో నాలుగు కిలోమీటర్లు కాల్వ తవ్వకం చేయాల్సి ఉండగా.. మూడు కిలోమీటర్లు పూర్తి చేశారు. పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు భూములు నష్టపోకుండా తిరుమలాయపాలెం మండలంలో ఎనిమిది కిలోమీటర్ల మేర టన్నెల్ ద్వారా కాల్వ తవ్వకం పనులు మంజూరు చేయించారు. అట్టి పనులు కూడా ప్రస్తుతం వేగంగా సాగడం లేదు. కిలోమీటరున్నర మాత్రమే టన్నెల్ కాల్వ తవ్వకం పనులు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది నవంబర్ వరకు టన్నెల్ పనులు పూర్తికావచ్చని అధికారులు చెబుతున్నారు. పాలేరు లింక్ కెనాల్ తవ్వకానికి ఇంకా పలు మండలాల్లో 600 ఎకరాల భూమిని కొనుగోలు చేయాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం భూముల కొనుగోలుకు డబ్బులు మంజూరు చేయడం లేదు. దీంతో పనులు ప్రారంభం కావడం లేదు.

### పాలేరు రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు

సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే గోదావరి జలాలు పాలేరు రిజర్వాయర్‌లోకి ప్రవహించనున్నాయి. దీంతో గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం జరుగనున్నది. కృష్ణా నది పరీవాహక ప్రాంతం కూడా గోదావరి జలాలతో స్థిరీకరణ జరుగనున్నది. దీంతో పాలేరు రిజర్వాయర్‌లోకి కృష్ణా జలాలు రాని సమయంలో గోదావరి జలాలతో భూములు సస్యశ్యామలం కానున్నాయి. ఖమ్మం జిల్లాలో సుమారు ఆరు లక్షల ఎకరాలకు సాగునీటి వసతి ఏర్పడనున్నట్లు ఐబీ అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లా రైతుల సాగునీటి కష్టాలను కడతేర్చేందుకు కేసీఆర్ నాయకత్వంలో గత ప్రభుత్వం చేపట్టిన సీతారామ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ కనబరుస్తున్నది. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ప్రాజెక్టు పనులకు నిధులు మంజూరు చేయించి త్వరితగతిన పనులు పూర్తి చేయించడంలో శ్రద్ధ కనబర్చడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఖమ్మం జిల్లాలో ముందుకు సాగని పాలేరు లింక్ కెనాల్ పనులు



తిరుమలాయపాలెం మండలంలో నత్తనడకన సాగుతున్న టన్నెల్ తవ్వకం పనులు

### 2026 నాటికి పనులు పూర్తి..

సీతారామ ప్రాజెక్టు పనుల్లో భాగంగా పాలేరు లింక్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఈ పనుల్లో భాగంగా 13, 14 ప్యాకేజీల్లో ఇంకా కొన్నిచోట్ల పనులు ప్రారంభంకావాల్సి ఉంది. ఆ ప్రాంతాల్లో భూమి కొనుగోలు జరగాల్సి ఉంది. 15, 16 ప్యాకేజీల్లో 80శాతం మేర పనులు పూర్తిఅయ్యాయి. తిరుమలాయపాలెం మండలంలో టన్నెల్ కాల్వ పనులు రెండు కిలోమీటర్లు పూర్తిఅయ్యాయి. 2026 నాటికి పాలేరు లింక్ కెనాల్ తవ్వకం పనులు పూర్తవుతాయి. **– బానాల రమేష్‌రెడ్డి, డీఈఈ**

# వామ్మో, చలి

- గజగజ వణుకుతున్న 'భద్రాద్రి' ప్రజలు
- నాలుగు రోజులుగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



కొత్తగూడెం పట్టణంలో వెలిసిన స్వెట్టర్ల దుకాణాలు



కొత్తగూడెం టౌన్/ రామవరం, నవంబర్ 20: భద్రాద్రి జిల్లాలో ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోయాయి. దీంతో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఫలితంగా పగలూ రాత్రీ అనే తేడా లేకుండా జనం చలికి వణికిపోతున్నారు. 'వామ్మో చలి..' అంటూ ఉన్ని దుస్తులవైపు పరుగులు తీస్తున్నారు. నిన్నా మొన్నటి వరకు తుపాను ప్రభావం కన్పించగా.. ఇప్పుడు దానికి చలికాలం సీజన్ తోడైంది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి జిల్లా ప్రజలను గడగడలాడిస్తోంది. కార్తీకమాసం కొనసాగుతున్న ఈ సమయంలో తెల్లవారుజామున నిద్రలేచే భక్తులు మరింతగా చల్లగా ఉన్న నీటితోనే స్నానాలు ఆచరిస్తున్నారు. ఇక కార్తీక పూజలు చేసే మహిళలు, వివిధ పనుల నిమిత్తం పయనం కావాల్సిన వృత్తిదారులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితి కావడంతో కాలు బయట పెడుతున్నారు.

ఉదయం పది గంటల సమయం దాటినా చలి వాతావరణం తగ్గడం లేదు. దీంతో చాలామంది ఇంటికే పరిమితమవుతున్నారు. కూలీలు, వ్యాపారులు మాత్రం తెల్లవారుజాము నుంచే పనులకు వెళ్లక తప్పడం లేదు. మరోవైపు తుపాను ప్రభావంతో పంట పొలాలు నీట మునగడంతో కూలీలు పొలాల వద్దకు వెళ్లి పొలం పనులు చేస్తున్నారు. చలిగాలులకు ప్రజలు దగ్గు, జలుబులతో ఆసుపత్రి పాలవుతున్నారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు చలికి అనేక ఇబ్బందులు పడుతున్నారు.

### తగ్గిన పగటి ఉష్ణోగ్రతలు..

చలి ప్రభావం రెండు రోజులున్నా కన్పిస్తున్నప్పటికీ గడిచిన నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 17 డిగ్రీలకు తగ్గిపోయి నమోదవుతున్నాయి. రాత్రయితే రగ్గులు కప్పుకున్నా చలి ఆగడం లేదు. అయితే, ఈ నెల చివరి వరకు ఇవే ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడం గమనార్హం.

### చలి ప్రభావంతో వాతావరణంలో మార్పులు..

చలి గాలుల తీవ్రత పెరగడంతో జిల్లా వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో జనం బయటకు రావాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. కొందరైతే చలికోట్లు వేసుకున్నాకే బయట అడుగు పెడుతున్నారు. వాతావరణంలో ఒక్కసారిగా ఇలాంటి మార్పులు రావడంతో చిన్నారులు, వృద్ధులు జలుబు, దగ్గు, జ్వరం భారిన పడుతున్నారు. అయితే, చలికాలంలో ఆరోగ్యం విషయం మరిన్ని జాగ్రతలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి గాలుల వేళ బయటకు రాకూడదని, న్యుమోనియో ఉన్నవాళ్లు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. దగ్గు, జలుబు వంటివి రెండు రోజులైనా తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. అయితే, ఇవే లక్షణాలతో ఇప్పటికే ఆసుపత్రుల వద్ద రోగుల సంఖ్య పెరుగుతోంది.

### చిన్న పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి



చలికాలంలో పిల్లల ఆరోగ్యం విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. చలి తీవ్రత పెరుగుతున్నందున వారు తప్పకుండా ఉన్ని దుస్తులు ధరించేలా చూడాలి. చలిగాలులకు బయటకు తీసుకెళ్లకూడదు. పెద్దవాళ్లు, వృద్ధులు కూడా ఆరుబయట తిరిగే సమయాన్ని తగ్గించాలి. జలుబు, దగ్గు వంటివి తగ్గేందుకు కొంత సమయం పడుతుంది. ఇంట్లో అందరూ వేడి చేసి చల్లార్చిన నీటినే తగడం మంచిది. స్నానానికి కూడా వేడినీటినే ఉపయోగించాలి. ముఖ్యంగా రోగులు అనవసరంగా బయటకు రావొద్దు. మంచు కురుస్తున్న వేల మరింత జాగ్రత్తగా ఉండాలి. **–డాక్టర్ పుష్పలత, ఎండీ జనరల్ మెడిసిన్, కొత్తగూడెం**

# నేడు ఖమ్మానికి హరీశ్‌రావు

- రెండు రోజులపాటు జిల్లాలో మాజీ మంత్రి పర్యటన
- ఖమ్మంలో కొవ్వొత్తుల ర్యాలీ, వ్యవసాయ మార్కెట్ సందర్శన
- చింతకాని మండలంలో రైతుల కుటుంబాలకు పరామర్శ

ఖమ్మం, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు గురువారం ఖమ్మానికి రానున్నారు. గురు, శుక్రవారాల్లో ఖమ్మం నగరంతోపాటు చింతకాని మండలాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సహా ఇతర నేతలు ఇప్పటికే సన్నాహక పనులను పూర్తి చేశారు. ఫార్మా కంపెనీల కోసం లగచర్ల ప్రాంతంలో గిరిజన రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కుంటున్న రేవంత్ సర్కారు విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఇప్పటికే పోరుబాట పట్టింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే దేశవ్యాప్త ఉద్యమం చేస్తున్నారు. బీఆర్ఎస్ అగ్ర నాయకులు మొత్తం ప్రజాక్షేత్రంలో ఉండి రైతులకు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో లగచర్ల రైతులకు మద్దతుగా ఖమ్మంలో నిర్వహించే కొవ్వొత్తుల ర్యాలీలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొంటున్నారు. ఆ తరువాత పత్తి, మిర్చి రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించాలనే డిమాండ్‌తో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శిస్తారు. ఈ తరువాత చింతకాని మండలంలో రైతులను పరామర్శిస్తారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు పిలుపునిచ్చారు.



### హరీశ్‌రావు పర్యటన వివరాలు ఇలా..

- లగచర్ల గిరిజన రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ గురువారం సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని మయూరిసెంటర్ నుంచి జడ్పీ సెంటర్ వరకు సంఘీభావ ప్రదర్శన, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తారు.
- రాత్రికి ఖమ్మంలోనే బస చేస్తారు.
- శుక్రవారం ఉదయం 7 గంటలకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శిస్తారు. పత్తి, మిర్చి పంటల మద్దతు ధరలపై రైతులతో అక్కడ ముఖాముఖి అవుతారు.
- ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతారు.
- 12 గంటలకు చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు బోజడ్ల ప్రభాకర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమ కేసుతో జైలు జీవితం గడిపిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను కూడా పరామర్శిస్తారు. అనంతరం అక్కడే కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తారు. –మధ్యాహ్నం ఒంటి గంటకు చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల మృతిచెందిన ఆ గ్రామ రైతు గూని ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు.

# రైతులను ఇబ్బంది పెడితే ఊర్కునేది లేదు

### మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ) : ధాన్యం, పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందిపెడితే ఊర్కునేది లేదని మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. నియోజకవర్గంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో వారం రోజులుగా పత్తి విక్రయిస్తున్న రైతులను తేమ శాతం పేరుతో కొర్రీలు పెడుతూ ఇబ్బంది పెడుతున్నారని, దళారులు తెచ్చిన పత్తిని తీసుకుంటూ, రైతుల పత్తిని కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. నిబంధనలు తట్టుకోలేక రైతులు ప్రైవేటులో అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు సందర్శించి రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. అలాగే లగచర్లలో ఫార్మా కంపెనీ పేరుతో రైతుల భూములు లాక్కోవాలని చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని, రైతులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ సర్కారుపై రైతులు తిరగబడితే పతనం ఖాయమన్నారు.



మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

# గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలి

### భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, నవంబర్ 20 : సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆదివాసీ గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలని, పలువురికి ఉపాధి కల్పించాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. పట్టణంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆవరణలో దమ్మక్క లయాబిలిటీ గ్రూప్ గిరిజన మహిళలు నెలకొల్పిన ఎంఎస్ఎంఈ యూనిట్‌ను రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యతో కలిసి పీవో బుధవారం ప్రారంభించారు. యూనిట్‌లో షాంపూ, సబ్బులు, తేనె, వెదురుతో తయారు చేసిన వివిధ రకాల కళాకృతులను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భద్రాద్రి రామయ్యను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగు రాష్ట్రాలు, దేశ, విదేశాల నుంచి భక్తులు నిత్యం వస్తుంటారని, ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు వారికి తెలిసే విధంగా కళాకృతులు ఉండాలని, వాటిని సరసమైన ధరలకు విక్రయించి లాభాలు ఆర్జించాలన్నారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం సమ్మయ్య, జేడీఎం హరికృష్ణ, మురళి, రమేశ్, విజయలక్ష్మి, సులోచన, బేబిరాణి, రాజకుమారి, రమాదేవి, భారతి, మంగ, కృష్ణవేణి, సురేశ్, సాయికుమార్, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి యూనిట్‌ను ప్రారంభిస్తున్న పీవో రాహుల్

# ఇల్లెందు డిపో ఎదుట సీఐటీయూ ధర్నా

**ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్**

ఇల్లెందు, నవంబర్ 20 : ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఇల్లెందు ఆర్టీసీ డిపో ఎదుట నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి మాట్లాడుతూ కార్మికుల విషయంలో ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని, మహిళా కార్మికులకు మినహాయింపు లేకుండా రాత్రివేళల్లో డ్యూటీలు వేస్తున్నారని ఆరోపించారు. ఇల్లెందు బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ, నాయకులు కామ నాగరాజు, సత్యనారాయణ, కోటి, లక్ష్మణ్, కోటేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, హుస్సేన్, సుల్తాన, మరియ, ఉమాదేవి పాల్గొన్నారు.




ఆర్టీసీ ఇల్లెందు డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు